క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



మల్లన్న దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న స్వామి దేవాలయ నిర్మాణానికి దోసూరు శంకరయ్య రూ.2.51లక్షలు, అంజయ్య రూ.30వేలు, జహంగీర్ రూ. 51వేలు, నర్సింహులు రూ.11వేలు, ముత్యల్‌రెడ్డి రూ.1,00,116, లింగం రూ.1.11లక్షలు, రాంరెడ్డి రూ.1.50లక్షలు, బోకుల లింగం రూ.1.51లక్షలు విరాళంగా అంజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావం పెంచుకోవాలన్నారు. మారుమూల గ్రామాల్లో దేవలయాలు నిర్మించి పూజలు చేయడం అభినందనీయమని కొనియాడారు. దోసూరు గోపాల్‌ను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, శంకరయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా ఆశీర్వదించండి

– పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: అభివృద్ధి చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని పాలమూరు చారిటబుల్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని లింగంధన, తొమ్మిదిరేకుల, కాకునూర్, కేశంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. గతంలో నియోజకవర్గంలో అనేక సేవ కార్యక్రమాలను నిర్వహించినట్టు ఆయన తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కోడిచర్ల సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఆకుల ప్రదీప్, ఐలయ్య, తిరుపతి, నరేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీను, జగదీశ్వర్‌రెడ్డి, మహేష్, కృష్ణ యాదవ్, పారేష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ నాయకత్వం నచ్చకే మారుతున్నాం

– కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌గౌడ్

కొత్తూరు: కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి, నాయకత్వం నచ్చకనే పార్టీ వీడుతున్నట్లు షాద్‌నగర్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. కొత్తూరు పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగుతూ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా వచ్చిన తర్వాత డబ్బున్నోళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. షాద్‌నగర్ అసెంబ్లీ టికెట్ కోసం ప్రయత్నిస్తే అక్కడ కూడా రేవంత్‌రెడ్డి తనకు అన్యాయం చేసినట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ తనతో పాటు కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన నలుగురు కౌన్సిలర్లతో పాటు తన అనుచరులతో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మాదారం నర్సింహ్మగౌడ్, సోమ్లనాయక్, అనిత, మాధవి, మిరాజ్, వీరమోని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కొత్తూరు: కొత్తూరు ఉమ్మడి మండలానికి చెందిన పలువురు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ఆదివారం మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇందులో భాగంగా సీనియర్ నాయకులు కడెపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి కొత్తూరు నుంచి బైకు ర్యాలీతో షాద్‌నగర్‌కు బయలు దేరారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్ గెలుపు కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- అవినీతి బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుదాం
- వీర్లపల్లి శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం
- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



పుట్టోనిగూడ గ్రామంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన నేతలతో ప్రతాప్‌రెడ్డి



జిల్లేడ్ చౌదరిగూడలో ఇంటింటి ప్రచారం

షాద్‌నగర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన ప్రకాశ్‌గౌడ్, లక్ష్మయ్య, లోక్రా, అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 100మంది నాయకులు, కొందుర్గు మండల మాజీ ఎంపీపీ ఆవుల గాయత్రీ రామకృష్ణ దంపతులు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, నిరుపేదలకు డబుల్ బెడ్రూం పంపిణీ, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మిద్దెల మల్లారెడ్డి, ప్రవీణ్‌గౌడ్, మనోహర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సబ్బండవర్గాలు అభివృద్ధి చెందుతాయని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ లావణ్య కృష్ణతో పాటు 150 మంది వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశ్, శ్రీధర్‌రెడ్డి, రాజు, భాస్కర్‌నాయక్, పావని, తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: అవినీతి బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని, ప్రతిఒక్కరూ కాంగ్రెస్‌కి ఓటు వేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని చేగూరులో ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యేగా పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మండల అధ్యక్షుడు నర్సింహా యాదవ్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, గురు రాజారావు, మంచనపల్లి నిరంజన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అమలుచేస్తామని కాంగ్రెస్ జిల్లేడ్ చౌదరిగూడం మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు అన్నారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని ముష్టిపల్లి, తుమ్మలపల్లి, ఎల్కగూడ, పెద్దఎల్కిచర్ల, జాకారం, గాలిగూడ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కాంగ్రెస్‌కి ఓటువేసి తిరిగి ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలని కోరారు. చంద్రశేఖర్, ఆంజనేయులు, వెంకటయ్య, పాల్గొన్నారు.

మరో అవకాశం ఇవ్వండి

- చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం



శంకర్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ రత్నం

శంకర్‌పల్లి: ఈ ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం పేర్కొన్నారు. ఆదివారం శంకర్‌పల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నగరానికి సమీపంలో ఉన్నా ఈ నియోజకవర్గం వెనుకబాటుకు గురైందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, చేవెళ్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కుటుంబ పాలన చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములుగౌడ్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, బీర్ల సురేశ్, ఐలయ్య, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత..

మొయినాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రత్నం సమక్షంలో గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు ఎదిరిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీలో చేరినవారిలో యువకులు సురేష్, నరేందర్, పోచయ్య, చక్రవర్తి, గండయ్య, నారాయణ, దర్శన్, నర్సింహ్మా తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ వెంకటేష్‌గౌడ్, నాయకులు జ్ఞానేశ్వర్, గరుగు రాజు, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే



చిల్కమర్రి సమావేశంలో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

- పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్
- కేసీఆర్ పాలనకు చరమగీతం పాడండి

షాద్‌నగర్: బీఆర్‌ఎస్, బీజేపీలు రెండు ఒక్కటేనని పీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిన్న చిల్కమర్రి, కమ్మదనం, కడివాయి తండా, పట్టణంలోని శ్రీనివాసకాలనీ, తిరుమల కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్కమర్రి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు చిల్కమర్రి రవీందర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేత కర్ణకోట రమేశ్, సింగిల్‌విండో డైరక్టర్ కేశవులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను గుర్తించి పార్టీ అధినేత్రి సోనియగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయించిందన్నారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పుల పాలు చేశారన్నారు. రాష్ట్రంలో ఆయన రాచరిక పాలన కొనసాగిస్తున్నారని, దీనికి చరగీతం పాడాల్సిన సమయం వచ్చిందన్నారు. ఓట్లకోసం కేసీఆర్ నమ్మలేని అమలుకానీ హామీలు గుప్పిస్తున్నారన్నారు. ఐనప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, దంగు శ్రీనివా స్ యాదవ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్ అప్ప, శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీ బొమ్మ అరుణ, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో విలేకరి ఆత్మహత్య

శంకర్‌పల్లి: కుటుంబ కలహాలతో ఓ విలేకరి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని జనవాడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జనవాడ గ్రామానికి చెందిన అంబయ్యచారి(35) ఓ ప్రముఖ టీవీ చానల్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల ప్రతి రోజు ఇంట్లో కుటుంబ కలహాలు జరిగేవని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11గంటలకు పై అంతస్తులోని రూంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నందిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నివాళి..

మొయినాబాద్‌రూరల్: అంబయ్యచారి అకాల మృతి విశ్వకర్మ సంఘంతో పాటు విలేకరులను దిగ్భ్రాంతికి గురి చేసిందని విశ్వకర్మ సంఘం మండల నాయకులు వడ్ల నర్సింహ్మాచారి, సంతోష్‌కుమార్‌లు తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, మొయినాబాద్ చౌరస్తాల్లో చిత్రపటానికి ఘన నివాళులులర్పించారు. ఈ కార్యక్రమంలో బాకారం శ్రీనివాస్‌చారి, వీరచారి, అమ్డాపూర్ భానుచందర్, హిమాయత్‌నగర్ అశోక్‌చారి పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: నివాళి అర్పిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

బీఆర్‌ఎస్ పాలనలో విసిగిపోయారు



షాబాద్: కేశవగూడ ఎన్నికల ప్రచారంలో కావలి చంద్రశేఖర్



పెద్దమంగళారం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న భీంభరత్

- చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్

మొయినాబాద్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో జనం విసిగిపోయారని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంతోపాటు పెద్దమంగళారం, అమీర్‌గూడ గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి వారు చేయి గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్లలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ కండిక రమేశ్, సీనియర్ నాయకుడు మోత్కుపల్లి రాములు, మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, సత్యనారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కొమ్మిడి వెంకట్‌రెడ్డి, గణేశ్‌గౌడ్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: కల్వకుంట్ల పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలని, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం కేశవగూడ, మరియాపూరం, నాగర్‌కుంట, దైవాలగూడ, బోనగిరిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, యాదగిరి, సత్యనారాయణ, వెంటకట్‌రెడ్డి, వేణు, గౌరీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం



శంకర్‌పల్లి: మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



షాబాద్: ఎన్నికల ప్రచారంలో రాము

- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ప్రొద్దటూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీకి మంచి పట్టు ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌సింగ్, మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహా, బయన్న, రఘుపతిరెడ్డి, యాదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సర్దార్‌నగర్, అంతారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా నిరంకుశ, నియంత, అవినీతి పాలన సాగిస్తున్న కేసీఆర్ సర్కార్‌కు ప్రజలు ఎన్నిల్లో చరమగీతం పాడాలన్నారు. బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలకు సేవకుడిలా పనిచేస్తానని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. క్యామ నారాయణ, మాణెయ్య, మహేందర్, రవీందర్‌గౌడ్, మల్లికార్జున్, ప్రశాంత్, నవీన్, సుమన్, పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం

మొయినాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని మొయినాబాద్ మండల అధ్యక్షుడు వెంకటాపూర్ మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్కెపల్లిలో ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి నాయకులతో కలిసి గడపగడపకు తిరుగు తూ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యను గెలిపించాలని ప్రచారం చేశారు. అఖిల భారత యాదవ సంఘం కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్, మండల పీఏసీఎస్ చైర్మన్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, మత్స్యకార్మికుల సంఘం అధ్యక్షుడు వెంకటాపూర్ బాలరాజు పాల్గొన్నారు.

అధికారం ఖాయం



శంకర్‌పల్లి: మోకిలలో ప్రచారం నిర్వహిస్తున్న కాలె యాదయ్య

- చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అధికారం ఖాయమని చేవెళ్ల నియోజకవర్గం బీర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం మోకిల, మోకిల తండాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కళ్యాణలక్ష్మీ, శాదీముబారక్ వంటి పథకాలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి



బీఆర్‌ఎస్‌లో ఆహ్వానిస్తున్న గణేశ్, రవీందర్ యాదవ్

నందిగామ: గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి పనులు బీఆర్‌ఎస్ చేసి చూపించిందని, ఈ ఎన్నికల్లో పార్టీని ఆదరించి మూడో సారి అధికారంలోకి తీసుకురావాలని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. రంగాపూర్‌లో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఈట గణేశ్, ఎంపీపీ రవీందర్ యాదవ్‌లు మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అనేక అభివృద్ధి పనులు చేపట్టారని వారు గుర్తు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

మొయినాబాద్: ఎలుకగూడకు చెందిన బీజేపీ, ఏబీవీపీ యువకులు సర్పంచ్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కొందుర్గు: కొందుర్గు మండలంలోని చిన్నఎల్కిచర్ల, ముట్పూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు బాగుపడుతాయన్నారు. అంజయ్యయాదవ్ అన్ని గ్రామాల అభివృద్ధికి కృషిచేశాడన్నారు. ఆయనను మరోసారి ఆశీర్వదించాలన్నారు. సర్పంచులు నర్సింహా రెడ్డి, సంధ్యారాణి, రఘు, పాల్గొన్నారు.